
నాటి తెన్‌కాళియమ్మ.. నేటి చెంగాళమ్మ

ఐదు శతాబ్దాల కిందట అది ఓ చిన్న ఆలయం.. అందులో దక్షిణాభిముఖంగా అమ్మవారు కొలువుదీరారు. అందుకే ఆమెను ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని తమిళులు తెన్‌కాళియమ్మ అని పిలుచుకున్నారు. ఆమె దినదిన ప్రవర్ధమానం చెంది, నేడు చెంగాళమ్మగా పూజలందుకుంటోంది.



నాటి చెంగాళమ్మ ఆలయం (ఫైల్)



స్వర్ణ విమానగోపురంపై స్వర్ణ శోభిత చెంగాళమ్మ

సూళ్లూరుపేట: పట్టణంలోని కాళంగి నదీ తీరాన ఉన్న గ్రామశక్తి అమ్మవారు దినదిన ప్రవర్ధమానమై నేడు ఆంధ్ర, తమిళనాడు భక్తులకు ఆరాధ్యదైవమై చెంగాళమ్మ పరమేశ్వరిగా విరాజిల్లుతోంది. చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి (అప్పట్లో డండుబాట) పక్కనే చిన్న ఎరుపురంగు దేవాలయం ఉండేది. అది నేడు దాతల సాయంతో కల్యాణ మండపం, కాటేజీలు, చండీయాగాలు, పుష్పయాగాలు, కుంకుమపూజలు, నిత్యాన్నదాన పథకం, గర్భాలయానికి బంగారు తాపడం, విమా నగోపురానికి బంగారు తాపడం, ఆలయం ఆవరణ లో గ్రానైట్ ఫ్లోరింగ్, నూతన కార్యాలయ భవనా లు, ఆస్థాన మండపం తదితర ఎన్నో వసతులతో దిన దిన ప్రవర్ధమానమై అభివృద్ధి చెందిన చెంగాళమ్మ ఆలయంగా విలసిల్లుతోంది. కోరి కొలిచిన వారికి కొంగు బంగారమై కోర్కెలు తీర్చే తల్లిగా పేరుగాంచింది. కోర్కెలు తీరిన భక్తులు భారీ విరాళాలివ్వడంతో చెంగాళమ్మకు స్వర్ణాభరణాలు, కిరీటాలు, త్రిశూలాలు, వెండి పల్లకి సమకూరాయి.

ఆలయ చరిత్ర ఇదీ..

ఐదారు వందల ఏళ్ల కిందట ముందు కొంతమంది పశువుల కాపరులు ఓ రోజు సాయంత్రం పశువులు మేపుకుని ఇంటికెళుతూ వాటిని కడుక్కోవడానికి కాళంగినదిలో దిగారు. ఇంతలో ఓ యువకుడ్ని ఉన్నట్టుండి ఓ సుడి ఆవరించి నీటి అడుగు భాగానికి తీసుకెళ్లింది. ఆ సమయంలో ఆ యువకుడు తన ప్రాణాలు కాపాడుకోవడం ఆసరా కోసం వెతుకులాడాడు. అప్పుడు అతనికి ఓ పెద్ద బండ రాయి దొరకడంతో ఒడిసి పట్టుకున్నారు. అంతలోనే సుడి అలలా వెళ్లిపోవడంతో ఆ యువకుడు బతుకుజీవుడా అంటూ బయటపడ్డాడు. నీటి లోపల జరిగిన విషయాన్ని తన సహచరులకు చెప్పాడు. అందరూ ఒకసారిగా కాళంగినదిలోని నీటి అడుగుభాగానికి ఈదుకుంటూ వెళ్లి గాలించగా రాయి దొరికింది. అందరూ కలిసి దాన్ని గట్టుకు తీసుకొచ్చి పరిశీలించారు. దానిపై అష్టభుజాలతో వివిధ ఆయుధాలను ధరించి వామపాదం కింద ఓ రాక్షసుడ్ని తొక్కిపట్టి చేతిలోని త్రిశూలంతో పొడిచి చంపుతున్న భంగిమలో ఉండడంతో ఇదేదో అమ్మవారి విగ్రహం అనుకుని నది ఒడ్డున రావి చెట్టు కింద పెట్టి వచ్చేశారు. జరిగిన విషయాన్ని గ్రామపెద్దలకు చెప్పగా మరుసటి రోజు వచ్చి చూసేసరికి అమ్మవారి విగ్రహం దక్షిణాభి ముఖంగా లేచి నిలబడి ఉంది. ఆ విగ్రహాన్ని మరోచోటికి తరలించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పటికీ అమ్మవారి విగ్రహం ఓ వైపునకు తిరిగి ఉండడమే దీనికి నిదర్శనం. మరుసటి రోజు రాత్రి గ్రామ పెద్దకు అమ్మవారు కలలో కనిపించి తనను అక్కడ నుంచి కదిలించవద్దని, తాను స్వయంభువుగా వెలిశానని చెప్పడంతో అక్కడే అమ్మవారికి చిన్న గుడి కట్టారనే కథనం ప్రచారంలో ఉంది. దక్షిణాభి ముఖంగా ఉండడంతో అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని తమిళులు తెన్ కాళియమ్మ అని పిలుచుకుంటూ ఉండేవారని తెలుస్తోంది. (తెన్ కాళియమ్మ అంటే దక్షిణ కాళీమాత అని అర్థం.) నాటి తెన్‌కాళియమ్మ కాలగమనంలో చెంగాళమ్మగా మారిందని పెద్దలు చెబుతున్నారు.

తలుపులు లేని ఆలయం

రాష్ట్రంలో ఎక్కడా తలుపులు లేకుండా ఆలయం ఉండడం అరుదు. ఇందుకు కూడా ఒక కథనం ప్రచారంలో ఉంది. చెంగాళమ్మ ఆలయంలో చోరీ చేయడానికి ప్రయత్నించి ఓ దొంగ భంగపడ్డాడు. దీంతో ఆలయానికి తలుపులు ఏర్పాటు చేయాలని పెద్దలు నిర్ణయించారు. వెంటనే వడ్రంగిని పిలిపించి పనిని అప్పగించారు. వారు తలుపులకని తెచ్చిన చెక్కలను ఆలయం పక్కనే ఉన్న చెట్టుకు ఆనించి వెళ్లారు. ఉదయానికి అవి చెట్టులో కలిసి పోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భక్తులు అన్ని వేళలా దర్శనం చేసుకునే ఉండాలే కానీ నా ఆలయానికి తలుపులు పెడతారా! అని అమ్మవారు మరో మహిళను ఆవరించి చెప్పడంతో ఇప్పటికీ తలుపులు లేవు. నాడు తలుపు చెక్కలు కలిసిపోయిన చెట్టు నేడు మహిమాన్వితమైన వృక్షంగా ప్రసిద్ధి చెందింది. సంతానం లేని వారు ఇక్కడ ఊయల కడితే కచ్చితంగా సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మకం ఈనాటికి వుంది.

అర్వభూమి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మొదటి తిరునాళ్లు

అప్పట్లో సూళ్లూరు గ్రామపెద్ద అర్వభూమి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మొదట చెంగాళమ్మ తిరునాళ్లు చేసినట్టుగా పెద్దల చెబుతుంటారు. అనంతరం ఆయన కుమారుడు కృష్ణారెడ్డి, ఆ తరువాత కృష్ణారెడ్డి కొడుకు వెంకురెడ్డి అమ్మవారిని సేవించారు. చంద్రారెడ్డితో ప్రారంభమైన వంశపారపర్య ధర్మకర్తల మండలి ఐదు తరాల అనంతరం రామచంద్రారెడ్డితో ముగిసింది. 1960లో ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో చేరింది. అప్పటి నుంచి ఆ శాఖ ఆధ్వర్యంలో తిరునాళ్ల జరుగుతోంది.

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు వరగలి విద్యార్థుల ఎంపిక



నాశిన అభినేత్రి



షేక్ సనాఫర్హత్

చిల్లకూరు: మండలంలోని వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్ షిప్‌న(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ఆదివారం ఆ పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం తెలిపారు. జాతీయస్థాయిలో అందించే ఉపకార వేతనాలు పొందేందుకు ఏర్పాటు చేసిన పరీక్షకు పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినులు షేక్ సనాఫర్హత్, నాశిన అభినేత్రి హాజరయ్యారన్నారు. ఈ మేరకు శనివారం పరీక్ష ఫలితాలు విడుదల కాగా ఇద్దరు విద్యార్థినులు ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి 9, 10 ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనాలు అందుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇలాంటి పోటీ పరీక్షలకు హాజరై తమ కుటుంబాలకు అండగా ఉండేందుకు కృషి చేయాలని అన్నారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

ఘనంగా పొంగళ్లు



బోనాలతో వెళుతున్న మహిళలు

చిల్లకూరు: మండలంలోని గుత్తావారిపాళెం గ్రామదేవత పేరంటాళ్లకు ఆదివారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని మహిళలందరూ బోనాలతో ఆలయానికి చేరుకుని, అక్కడ పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి, ప్రసాదాలను పంచి పెట్టారు. అన్నదానం చేశారు.

మోహినీ అలంకారంలో ప్రసన్న వెంకన్న



గూడూరు: పట్టణంలోని రాజావీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారికి రాత్రి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు, ఉభయకర్తలు రఘురామయ్య గౌడ్, శ్రీనివాసులుగౌడ్, బాలసుబ్రమణ్యం, బాలకృష్ణంరాజు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతి భవనం.. పునాదులకే పరిమితం



ఆగిన ఆదర్శ పాఠశాల వసతి భవనం

దొరవారిసత్రం: మావిళ్లపాడులోని ఆదర్శ పాఠశాల (బాలుర)వసతి భవనం పునాదులకే పరిమితమైంది. గ్రామంలో పదేళ్ల కిందట ఐదు ఎకరాల విస్తీర్ణంలో పాఠశాల, వసతి భవనం నిర్మాణాలను సుమారు రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మించేలా చర్యలు చేపట్టారు. పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేశారు. అయితే వసతి భవనం మాత్రం పునాదుల స్థాయిలోనే ఆగిపోయింది. పదేళ్లు దాటినా వసతి భవన నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో భవన నిర్మాణానికి వేసిన పిల్లర్లలోని కమ్మీలు తుప్పు పడుతున్నాయి. ఇప్పటికైనా వసతి భవనం నిర్మిస్తారా? లేదా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కండలేరులో 28.778 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 28.778 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 200, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 80, లోలెవల్ స్లూయిస్‌కు 230 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదరిక నిర్మూలనే జగనన్న అజెండా



మోదుగులపాళెంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

పెళ్లకూరు: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పేదరిక నిర్మూలనే ప్రధాన అజెండాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం మోదుగులపాళెం, ఊడిపూడి, బంగారంపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని అవరోధాలు ఎదురైనా రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా, పేదరిక నిర్మూలనే అజెండాగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించి సుపరిపాలనను కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీడీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, పార్టీ మండల కన్వీనర్ సుధాకర్ నేతలు సోమశేఖర్‌రెడ్డి, అమరేంద్రరెడ్డి, రఘునాయుడు, వెంకటకృష్ణారెడ్డి, సునీల్, మోహన్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఏమి చేశామన్నదే ముఖ్యం



కల్వర్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దేవసేనమ్మ

గూడూరు: సమాజం మనకే మిచ్చిందని ఆలోచించకుండా, సమాజానికి మనం ఏమి చేశామన్నదే ముఖ్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ అన్నారు. పీఎస్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల వ్యయంతో నిర్మించిన కల్వర్టును ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆదివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని కరణాల వీధి నుంచి బాలాజీనగర్ వెళ్లే వారికి కాలువ దాటే క్రమంలో కల్వర్టు లేక ఇబ్బందులు పడేవారన్నారు. ఈ క్రమంలో వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తమ పీఎస్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలతో ఈ ప్రాంతంలో కల్వర్టును నిర్మించామన్నారు. దీంతో ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరమని ఆమె తెలిపారు. అలాగే ఈ నిర్మాణ పనులను దగ్గరుండి పూర్తి చేసిన స్వరూప్, ప్రదీప్‌ను ఆమె అభినందించారు. అనంతరం ఆ ప్రాంత ప్రజలు శివకుమార్‌రెడ్డి, దేవసేనమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌యాదవ్, జమళ్ల వాసు, సాయి, రమణయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అచ్యుతస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కలువాయి: మండలంలోని కుల్లూరులో ఉన్న శ్రీదేవీ భూదేవి సమేత అచ్యుతస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాదాసు యజ్ఞపవన్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు పాల్గొని, పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.


జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు పేట క్రీడాకారులు



రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నాయుడుపేట: జాతీయ స్థాయిలో అండర్–19 స్కూల్ గేమ్స్ పోటీలకు నాయుడుపేటకు చెందిన క్రీడాకారులు కె సీతారామ్, బీ పుట్టయ్య, బీ వినయ్, ఎస్ జ్యోతిప్రకాష్, టీ మహేష్, ఎం నాగలక్ష్మి, ఓస్ షని ఎంపికయ్యారని రెజ్లింగ్ కోచ్ బీ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు.

నీలాల నింగికి అరుణ వర్ణ ఆభరణం



ప్రకృతిలో చిత్ర విచిత్రాలెన్నో.. వానొచ్చేముందు దట్టమైన మేఘాలు.. సంధ్యా సమయంలో అరుణ వర్ణాలు.. నింగీ నేల నడుమ పర్వత సోయగాలు కనువిందు చేస్తుంటాయి.. ప్రకృతి ప్రేమికుల మనస్సు దోచుకుంటుంటాయి. మండల కేంద్రమైన సైదాపురం తహసీల్దార్ కార్యాలయం ఎగువ భాగంలో ఆదివారం భానుడు అందాలను ఒలకబోస్తూ నింగిలో వర్ణ చిత్రాలను ఆవిష్కరింపజేసిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. - సైదాపురం

చెంగాళమ్మ తిరునాళ్లకు అంకురార్పణ



ముడుపును గ్రామ పెద్దలకు అందజేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

తడ: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. తిరునాళ్లలో భాగంగా చెంగాళమ్మ ఆలయంలో అఖండ జ్యోతి, ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మధు ఆలయం నుంచి ముడుపును తీసుకుని గొల్లలములువు గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలోని దివంగత వేనాటి కుమారస్వామిరెడ్డి ఇంటి వద్దకు చేరుకుని ఆయన కుటుంబ సభ్యులకు ముడుపును అందజేశారు. తిరునాళ్ల తొలి రోజున ఇదే ఇంటి నుంచి చెంగాళమ్మకు అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం సుళ్లు ఉత్సవంతో తిరునాళ్లు మొదలు కావడం జరుగుతుంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేనాటి సుబ్రమణ్యంరెడ్డి, బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, హరిరెడ్డి, కులశేఖర్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశమైన ఎన్‌బీకేఆర్ పూర్వ విద్యార్థులు

చిల్లకూరు: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్సు అండ్ ఆర్ట్స్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. చిల్లకూరు మండలంలోని జాతీయ రహదారి పక్క నే ఉన్న ఏ–5 హోటల్‌లో వారు కలిశారు. ఎన్‌బీకేఆర్‌లో 1998–2001లో బీకాం పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉద్యోగాలు చేసుకోవడంతోపాటు కొంత మంది వ్యాపారాలు, మరికొంత మంది ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో స్నేహితులంతా ఒక్క చోట చేరి, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఏ ప్రాంతంలో ఉన్నారు.. కుటుంబ పరిస్థితులేమిటని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకచోట చేరేందుకు కృషి చేసిన రాయపనేని కిరణ్, కిషోర్‌రెడ్డి సుదాకరరెడ్డి, సురేంద్రరెడ్డిని స్నేహితులందరూ అభినందించారు.

భూ పంపిణీ చేయాలి

వెంకటగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు పంపిణీ చేయాలని వ్యవసాయకార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్ కోరారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం వెంకటగిరి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూమి, భుక్తి, సామాజిక న్యాయం, సమానత్వం కోసం దున్నేవారికే భూమి కావాలి అనే నినాదాలతో చేసే పోరాటలకు అన్నివర్గాల మద్దతు సమీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి బాలకృష్ణయ్య, పట్టణ కార్యదర్శి డి శివకుమార్, నాయకులు సుబ్బారావు, బుజ్జయ్య, రమణయ్య, అంకయ్య, రామయ్య పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని వినతి



నది దాటేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

సైదాపురం: పాలూరు –నిండలి మార్గం మధ్యలో కైవల్యానది వద్ద నూతన వంతెనను నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన వెంకటగిరికి వెళ్లేందుకు ఈమార్గం ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో వంతెనను నిర్మించేందుకు ప్రతిపాదనలు కూడా పంపారు. తరుచూ గంగ నీరు విడుదల చేసే సమయాల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఈ మార్గంలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. ఇలాంటి సమయాల్లో ఈ ప్రాంత ప్రజలు సమీపంలో ఉన్న పంట పొలాలకు కూడా వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతుంటారు. అధికారులు స్పందించి ఈ మార్గంలో వంతెను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గంగమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

రాపూరు: మండలంలోని రామిరెడ్డిపల్లెలో ఆదివారం గంగమ్మ కొలుపును పురస్కరించుకుని గ్రామస్తులు పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారు జామున గంగపెట్టె ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టారు. దీంతో రామిరెడ్డిపల్లెలో జాతర సందడి నెలకొంది.

మందుబాబుల అడ్డాగా వీధులు



కాశీపేటలో వదిలి వెళ్లిన మద్యం ఖాళీ సీసాలు

వెంకటగిరి: పట్టణంలోని రాత్రి అయితే చాలు వీధి దీపాలు లేని సందులు మందుబాబుల అడ్డాగా మారుతున్నాయి. మద్యం దుకాణాల సమీపంలో వీధిదీపాలు లేని సందుగొందుల్లో మద్యం సేవించి సీసాలు, చెత్తను అక్కడే విడిచిపెటి వెళ్లిపోతున్నారు. ప్రధానంగా కాశీపేట, త్రిభువనిసెంటర్, మనులాలపేట రోడ్డు తదితర ప్రాంతాల్లోని వీధిదీపాలు లేని సందువీధుల్లో నిత్యం ఇదే తంతు జరుగుతుంది. కొందరు ఆకతాయిలు మద్యం సీసాలను పగలు గొడుతుండడంతో ఉదయం పూట చూడకుండా ఆ వీధుల్లో వెళ్లే పాదచారులు గాయాల పాలవుతున్నారు. ఇలాంటి చర్యలు జరగకుండా పోలీసులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.